క్లుప్తంగా

సీఎంను కలిసిన అక్కరమాని



ముఖ్యమంత్రి జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: జీ–20 సదస్సుల్లో భాగంగా మంగళవారం విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ విమానాశ్రయంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గానికి చెందిన పరిస్థితులను వివరించారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు



డెయిరీఫారం వద్ద పైడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న అక్కరమాని

ఆరిలోవ: డెయిరీ ఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి ఆలయాన్ని మంగళవారం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సందర్శించారు. అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 7న పైడిమాంబ పండగ జరిగిన విషయం తెలిసిందే. జాతర అనంతరం మరో ఐదు వారాలు వరకు భక్తులు పండగలో భాగంగా అమ్మవారిని పూజిస్తారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల రామలక్ష్మణ్, మాజీ కార్పొరేటర్ జగ్గుపిల్లి అప్పలరాజు, విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇసుకతోట సర్వీసు రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలి



నిరసన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మద్దిలపాలెం: ఇసుకతోట సర్వీసు రోడ్డులో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ నాయకులు ఇసుకతోట జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు వామనమూర్తి మాట్లాడుతూ ఇసుకతోట కూడలిలో సిగ్నల్ పడిన సమయంలో ఇక్కడి సర్వీసు రోడ్డులో భారీ వాహనాలు ప్రవేశిస్తున్నాయని, వెంటనే ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇసుకతోట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి సర్వీసు రోడ్డు నుంచే ప్రారంభమవుతుందన్నారు. ఈ రోడ్డులో వాహనాలు జోరుగా వెళ్తుండడంతో పాదచారులు భయాందోళన చెందుతున్నారన్నారు. ప్రమాదాల నివారణకు తక్షణమే స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

భీమునిపట్నం: భీమిలి నేరెళ్లవలస కాలనీకి చెందిన మైనర్ వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న జోగ రమేష్ అనే యువకుడికి పీతల దేవి (16) అనే బాలికతో 8 నెలల క్రితం వివాహం జరిగింది. రమేష్ బైక్ మెకానిక్ షాపులో పని చేస్తున్నాడు. పెళ్లి సమయంలో రూ.5 లక్షల కట్నంతోపాటు ఇతర లాంచనాలు అందించారు. అయినప్పటికీ కొద్ది రోజులుగా అదనపు కట్నం కోసం దేవిని రమేష్ వేధించడంతోపాటు అనుమానించేవాడు. ఈ క్రమంలో తరచూ వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు దేవి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విజయనగరంలో నివసిస్తున్న మృతురాలి తల్లి పీతల యర్రమ్మమ్మ విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె మృతికి అల్లుడు రమేష్ కారణమని ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు దేవి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘పది’లమైన భవితకు సన్నద్ధం



కేడీపీఎం పాఠశాల



పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ప్రతి వ్యక్తి భవిష్యత్ నిర్మాణానికి తొలిమెట్టు పదో తరగతి. ఇక్కడ తొలి అడుగు విజయవంతంగా వేస్తే భవిష్యత్ జీవితం ఎంతో సాఫీగా సాగిపోతుందన్న నమ్మకం. ఈ నేపథ్యంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు కేడీపీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. వారిని విజయం సాధించే దిశగా పాఠశాల ఉపాధ్యాయులు విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో బాలికలు 70, బాలురు 75 మంది మొత్తం 145 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమే కాకుండా మెరుగైన మార్కులు సాధించే దిశగా పాఠశాలలోని 25 మంది ఉపాధ్యాయ బృందం నిరంతరం తర్ఫీదు ఇస్తోంది.

వంద రోజుల ప్రణాళిక

ప్రభుత్వం సూచించిన విధంగా 100 రోజుల ప్రణాళికను పటిష్టంగా పాఠశాలలో అమలు చేస్తున్నారు. విద్యార్థుల్లో ప్రతిభ, సామర్థ్యాలను గుర్తించి వారికి తదనుగుణంగా అవసరమైన మార్గదర్శకం అందిస్తున్నారు. కాస్త వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించారు. పరీక్షల్లో గ్రాఫ్‌లు, బహుళైశ్చిక ప్రశ్నలు, ఒక్క మార్కు ప్రశ్నలు వంటి ఏ చిన్న అంశాన్ని కూడా వదలకుండా అవగాహన కల్పిస్తూ ఉత్తీర్ణత పెంపునకు కృషి చేస్తున్నారు. ఆదివారం సైతం ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఐదు నుంచి ఆరుగురు విద్యార్థుల బాధ్యతను తీసుకున్నారు.

ఉదయం నిద్ర లేపడంతో మొదలు..

ఉదయాన్నే 5 గంటలకు తమకు కేటాయించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఫోన్ చేసి వారు చదివేలా చూస్తున్నారు.

తమకు కేటాయించిన విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనకబడ్డారు.. వారికి ఎదురవుతున్న సందేహాలను నివృత్తి చేయడం, అవసరమైతే సంబంధిత సబ్జెక్ట్ టీచర్‌తో మాట్లాడించడం చేస్తున్నారు. తల్లిదండ్రులతో సమావేశమై అవగాహన కల్పించే కార్యక్రమం కూడా నిర్వహించారు.

ప్రిపరేటరీ పరీక్షలు ఉపయుక్తం

జిల్లాలో నిర్వహించిన రెండు ప్రిపరేటరీ పరీక్షలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయి. వీటి వల్ల విద్యార్థులకు పరీక్ష విధానం, సమయ నిర్వహణ, సమాధానాలు ఎలా రాయాలి అనే అంశాలపై అవగాహన కలిగింది. ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షకు హాజరై మెరుగైన ఫలితాలు సాధిస్తారనే నమ్మకం ఉంది.

– పి.శ్రీనివాసరావు, ఆంగ్ల ఉపాధ్యాయుడు

చాప్టర్ వారీగా చదివిస్తున్నారు..



ఉపాధ్యాయులు ఒక క్రమపద్ధతిలో ప్రతి సబ్జెక్టులో చాప్టర్ వారీగా చదివిస్తున్నారు. సాయంత్రం వేళలో సైతం అధ్యాపకులు ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తూ, మా సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో మెరుగైన ప్రతిభ చూపేలా అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

– కె.పూజిత, పదో తరగతి విద్యార్థిని

నమూనా పరీక్షలు ఉపయోగపడ్డాయి..



పరీక్షల భయం పోయి, బాగా రాయడానికి ఉపయుక్తంగా నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీని ఫలితంగా కాలనిర్వహణ, జవాబు రాసే విధానం వంటివి అలవాటు అయ్యాయి. ముందుగా పరీక్షల భయం మాలో కలగకుండా ఉపాధ్యాయులు అందించిన సూచనలు, శిక్షణ ఉపయోగపడ్డాయి.

– జి.హేమంత్ కుమార్, పదో తరగతి విద్యార్థి

సమష్టి కృషితో ఉత్తీర్ణత పెంపు



ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఉంది. విద్యార్థులు ఎంతో ఇష్టంగా చదువుతున్నారు. ఉపాధ్యాయులంతా ఎంతో స్ఫూర్తిదాయకంగా పని చేస్తున్నారు. ప్రభుత్వం అందించిన సూచనలు పాటిస్తూ, ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నాం.

– ఎస్.సుమితిబాయి, హెచ్‌ఎం, కేడీపీఎం పాఠశాల

నిండుగా ముడసర్లోవ



నీటితో ముడసర్లోవ రిజర్వాయరు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయరు నిండుకుండను తలపిస్తోంది. వేసవి ఎండలు తీవ్రత పెరుగుతున్నప్పటికీ రిజర్వాయరు నీటితో కళకళలాడుతోంది. దీంతో ఆరిలోవ ప్రాంతానికి వేసవిలో నీటి ఎద్దడి ఉండబోదని జీవీఎంసీ ముడసర్లోవ నీటి సరఫరా అధికారులు చెబుతున్నారు. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో ఈ రిజర్వాయరులో సామర్థ్యానికి మించి నీరు చేరింది. దీంతో కొన్ని రోజుల పాటు ఓవర్ ఫ్లో జరిగింది. దీని గరిష్ట సామర్థ్యం 169 అడుగులు. మంగళవారం నాటికి ఇందులో 165.5 అడుగులు నీరు నిల్వ ఉంది. సాధారణంగా మార్చి నెల వచ్చేసరికి 155 అడుగులు కంటే తక్కువే నీరు ఉండేదని నీటి సరఫరా అధికారులు అంటున్నారు. ప్రతి సంవత్సరం మే, జూన్ నెలల్లో ఆరిలోవ ప్రాంతానికి నీటి సమస్య వచ్చేది. ఈ ఏడాది ఆ సమస్య ఉండదని చెబుతున్నారు. ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్, టీఐసీ పాయింట్ వరకు కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తారు. దీంతో పాటు హనుమంతవాక నుంచి దీన్‌దయాళ్‌పురం, పైనాపిల్ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారం వరకు ట్యాంకర్లతో సరఫరా చేస్తారు.

తీరంలో జీ-20 దేశాల జెండాల రెపరెపలు



తీరంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాలు

బీచ్ రోడ్డు: జీ–20 సదస్సు నగరంలో జరుగుతున్న నేపథ్యంలో ఆయా దేశాల జాతీయ జెండాలు సాగర తీరంలో రెపరెపలాడుతున్నాయి. అలాగే ఆయా దేశాల వివరాలతో కూడిన సైన్ బోర్డులను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. బీచ్‌కు వస్తున్న సందర్శకులు ఆసక్తిగా వాటిని తిలకిస్తున్నారు.

సాంస్కృతిక రథసారథి కొసనా



కొసనా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

సీతంపేట: అరున్నర దశాబ్దాలు కళారంగానికి సేవలందించిన కొసనా తృతీయ వర్ధంతి సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొని కొసనా చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించిన సాంస్కృతిక నిఘంటువు కొసనా అని కొనియాడారు. కళావేదిక ట్రస్టు అధ్యక్షులు నందూరి రామకృష్ణ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నాటకం, చిత్రలేఖనం వంటి అంశాలలో నిరంతరం సేవలందించిన మహోన్నత వ్యక్తి కొసనా అని ప్రశంసించారు. కొసనా తనయుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ తన తండ్రి సేవలను గుర్తుపెట్టుకుని క్రమం తప్పకుండా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆధ్యాత్మికవేత్తలు ఎస్.ఫణిస్వామి, ఎం.వి.రాజశేఖర్, కొసనా కల్చరల్ అకాడమి అధ్యక్షురాలు సుసర్ల శేషమణి, స్వరరంజని అధ్యక్షురాలు లతా రాములు, కళారంగ ప్రముఖులు మేడా మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య, పి.శ్యామ్‌సుందర్, మెలోడి సత్యనారాయణ, ఎంవీఆర్ నాగేశ్వరరావు, ఎంటీఆర్ త్రినాథ్, లోకేష్, బంగారాజు, బి.సత్యమాధవి పాల్గొని నివాళులు అర్పించారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెగా డీఎస్సీని విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు.

గ్రూప్-1 పరీక్ష వాయిదాపై హర్షం

ఎంవీపీ కాలనీ: గ్రూప్–1 ప్రధాన పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయడంపై నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వానికి, వాయిదా దిశగా కృషి చేసిన మంత్రి బొత్స సత్యనారాయణకు ఆయన ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. వాయిదాతో శిక్షణకు అభ్యర్థులకు మరికొంత సమయం లభించిందన్నారు. ఎస్సై, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షలో ప్రశ్నపత్రంలో లోపాల నేపథ్యంలో సచివాలయ పరీక్షల తరహాలో 15 గ్రేస్ మార్కులు కలపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ వయోపరిమితి పెంచి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

టెక్‌ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ



కాలేజీ అధ్యాపకులతో టెక్‌ఫెస్ట్‌లో ప్రతిభా ధ్రువపత్రాలు అందుకున్న గైస్ విద్యార్థులు

మురళీనగర్: కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్ ఫెస్ట్‌లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) విద్యార్థులు ప్రతిభను చాటారు. వీరు 8 గ్రూపులుగా తమ సృజనాత్మక పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించారు. రెండు గ్రూపులు పోస్టర్ ప్రదర్శన విభాగం, ఆరు గ్రూపులు పేపర్ ప్రజంటేషన్ (పరిశోధనా పత్రం) విభాగాల్లో పాల్గొన్నారు. వీరిలో 5 గ్రూపులు బహుమతులు గెలుచుకున్నాయి. బి.ప్రణీత, సీహెచ్ మేఘన, జి.మెర్సీ, ఎల్ మురళీకృష్ణారావుల బృందం ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీకి సంబంధించి పోస్టర్ ప్రదర్శనలో మొదటి బహుమతి, గ్రీన్ కెమికల్స్ విభాగంలో బి.ప్రియాంక, అంజలి కుమారి, పి.జాహ్నవి బృందం పేపర్ ప్రజెంటేషన్‌లో మొదటి స్థానం, ఇదే విభాగంలో బి.హరి శంకర్, బి.నిత్యప్రకాష్, ఎంవీ నరేష్ వర్మ బృందం ద్వితీయ బహుమతి, కార్బన్ సీక్వెస్ట్రేషన్ విభాగంలో వై.హర్ష, పి.లక్ష్మణ్‌చరణ్, కె.దుర్గా ప్రసాద్‌ల బృందం పేపర్ ప్రజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి, సబ్‌-సీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో జయంతి శ్రావణ శృతి, ఎల్.తేజసాయి, వి.జ్ఞానేశ్వర్ బృందం పేపర్ ప్రజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా కాలేజీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర సిబ్బంది అభినందించారు.

జీవీఎంసీ ఆస్తుల లీజు వేలం వాయిదా

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లో డైలీ మార్కెట్, వారపు సంత, ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుము, పార్కింగ్, క్యాంటీన్, ఐస్ క్రీమ్ బల్ల నిర్వహణ లీజు కోసం నిర్వహించాల్సిన వేలంపాట మరోసారి వాయిదా పడింది. కేవలం మార్కెట్ వేలం పాటకి ఒకే ఒక్కరు హాజరు కావడంతో బుధవారానికి వాయిదా వేసినట్టు సూపరింటెండెంట్ అప్పలరాజు చెప్పారు. ఆసక్తి కలిగిన పాటదారులు మధురవాడ జోనల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటల నుంచి నిర్వహించే పాటలో పాల్గొనాలని కోరారు.

‘రామాయణ సంగ్రహము’ గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: రచయిత ఆదూరి భీమారావు రచించిన రామాయణ సంగ్రహము గ్రంథావిష్కరణ సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ప్రసన్నభారతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమారావు 90 ఏళ్ల వయస్సులో గ్రంథాన్ని రాయడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ వాల్మీకి రామాయణం ఈ సృష్టి ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. శాశ్వత విలువలు రామాయణంలో ఉన్నాయని, వేదమే రామాయణంగా అవతరించిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త డి.వి.సూర్యారావు గ్రంథ సమీక్ష చేశారు. కేవలం కథ చెప్పడమే కాకుండా కథా ఘట్టాలను, పాత్రలను విమర్శ దృష్టితో పరిశీలించారని ప్రతి కాండ సారాన్ని చక్కని విశ్లేషణతో అందించారన్నారు. రచయిత భీమేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని వ్యాఖ్యానాలు ఆధారంగా గ్రంథ రచన చేశానని తెలిపారు. సంస్థ ప్రతినిధి సర్వేశ్వర ప్రసాద్ పర్యవేక్షించారు.

విద్యా సమాచారమ్

ఘనంగా జియోఫిజిక్స్ విభాగ దినోత్సవం



జియోఫిజిక్స్ విభాగ దినోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియోఫిజిక్స్ విభాగ దినోత్సవాన్ని మంగళవారం టీఎల్‌ఎన్ సభామందిరంలో ఘనంగా నిర్వహించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై సొసైటీ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ ఇన్ జియోఫిజిక్స్, సొసైటీ ఆఫ్ పెట్రోలియం జియో ఫిజిక్స్, ఇండియన్ జియో ఫిజికల్ యూనియన్ విద్యార్థి శాఖలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విధానాన్ని వివరించారు. విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు, విశ్రాంత ఆచార్యులు పి.రాజేంద్రప్రసాద్, ఎస్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్, ఆచార్య పి.రామారావు, ఆచార్యులు కె.ప్రహ్లాద్, బి.ఆనంద గజపతిరాజు, డాక్టర్ ఎం.జ్యోతి ప్రకాష్, డాక్టర్ పి.త్రినాథరావు, డాక్టర్ జి.రాజారావు తదితరులు ప్రసంగించారు. ఎమ్మెస్సీ(టెక్) కోర్సులో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

‘కాంట్రాక్ట్ అధ్యాపకులుగా ‘గెస్ట్’లకు అవకాశమివ్వాలి’

మద్దిలపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొత్తగా చేపడుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకాల్లో ఇప్పటికే పదేళ్లుగా పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు అవకాశం కల్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు శరత్ ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2014 నుంచి ఇప్పటి వరకూ 1074 మంది గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. 2012 నుంచి కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ నియామకాలు నిలిపివేశారన్నారు. అప్పటి నుంచి గెస్ట్ ఫ్యాకల్టీతోనే కాలం వెళ్లదీశారన్నారు. ప్రస్తుతం 21 కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టులు భర్తీ చేయడానికి రీజనల్ జాయింట్ డైరెక్టర్ సన్నాహాలు చేస్తున్నారని, త్రిసభ్య కమిటీ ద్వారా నియామకమైన గెస్ట్ ఫ్యాకల్టీలకు ఆ అవకాశం కల్పించాలని కోరారు. లేని పక్షంలో ఆ నియామకాలను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నిలిపివేయాలని శరత్ డిమాండ్ చేశారు.

ఎంవీపీ పబ్లిక్ స్కూల్‌లో ఫీజుల పెంపుపై ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఎంవీపీ కాలనీ: ఆళ్వార్‌దాస్ గ్రూప్స్‌లోని ఎంవీపీ పబ్లిక్ స్కూల్‌లో ఫీజులు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు రెండో రోజు మంగళవారం కూడా ఆందోళన కొనసాగించారు. పెంచిన ఫీజులు తగ్గించాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. స్కూల్ కార్యాలయం ఎదుట కొంతసేపు నిరసన చేపట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు అనంతరం స్కూల్ ఎదుటి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఇప్పటికైనా స్కూల్ యాజమాన్యం పెంచిన ఫీజులను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థి ప్రతిభ



హరి జైమిత్ర

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న ఎం.హరి జైమిత్ర 2022–23 విద్యా సంవత్సరంలో నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలింపియాడ్(ఎన్ఎస్‌వో) లెవెల్–2లో ప్రతిభ కనబరిచాడు. ఈ ఫలితాలు ఈ నెల 26న విడుదలయ్యాయి. ఈ పరీక్షలో ఇంటర్నేషల్ స్థాయిలో మూడో ర్యాంక్ సాధించి బ్రాంజ్ మెడల్‌కు ఎంపికయ్యాడు. దీంతో పాటు జోనల్ స్థాయిలో మొదటి ర్యాంక్‌లో నిలిచాడు. హరి జైమిత్రను పాఠశాల కరస్పాండెంట్ మోహన్ కృష్ణ, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

క్షయపై అవగాహన ర్యాలీ



బాలాజీనగర్ సంతలో క్షయ నివారణ అవగాహన ర్యాలీ చేస్తున్న టీబీ విభాగం సిబ్బంది

ఆరిలోవ: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ విభాగం సిబ్బంది మంగళవారం 11వ వార్డు బాలాజీనగర్ సంతలో అవగాహన ర్యాలీ చేపట్టారు. వ్యాపారులు, వినియోగదారులకు కరపత్రాలు పంపిణీ చేసి టీబీ లక్షణాల గురించి వివరించారు. దగ్గు, జ్వరం ప్రారంభమై రెండు వారాలు దాటినా తగ్గకపోవడం, బరువు, ఆకలి వేయకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ముందు జాగ్రత చర్యలు తీసుకొని క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు.

రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ



క్వీన్‌మేరీ స్కూల్లో రాగిజావ పంపిణీని పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం ధర్మేంద్రరెడ్డి

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య (ఇంటర్వెల్ సమయంలో) విద్యార్థులకు రాగిజావ ఇచ్చేలా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. జిల్లాలోని 587 పాఠశాలల్లో అమలు చేస్తుండగా, 87,861 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. రోజుకో రుచికరమైన వంటకంతో జగనన్న గోరుముద్ద పథకం అందిస్తూనే, విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేకంగా రాగిజావ ఇస్తున్నారు. బెల్లం పొడి కలిపిన రాగిజావ ఎంతో రుచికరంగా ఉండటంతో దీనిని తీసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పరిశుభ్రమైన వాతావరణంలో రాగిజావ తయారు చేసేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

కృష్ణా కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. కృష్ణా జూనియర్ కళాశాలలోని సెంటర్–ఏలో జరిగిన పరీక్షకు 658 మంది రాయాల్సి ఉండగా.. ఆరుగురు, డిగ్రీ కళాశాలలోని సెంటర్–బీలో జరిగిన పరీక్షకు 676 మంది రాయాల్సి ఉండగా.. ఒకరు గైర్హాజరయ్యారు.